# స్నేహి

**- వలివేటి నాగచంద్రావతి**


స్టౌవ్ మీద తెర్లుతున్న నీళ్ళగిన్నె పటకారుతో ఎత్తి కాఫీ ఫిల్టరులో పోస్తున్నాను.

'అమ్మా!' లోగొంతుకతో, రహస్యంగా...

'ఎవరు?' కనుబొమలు కాస్త చిట్లించి మెడ తిప్పి చూశాను.

ఇంకెవరు... నా సుపుత్రుడు బాబ్జీ. పక్కనే తోడుదొంగలాగా వాడి అక్క అపూ- అపర్ణ. బాబ్జీ సిక్స్త్ స్టాండర్డ్ చదువుతున్నాడు. అపూ ఏమో ఎయిత్. వాళ్ళ స్కూలు నుంచి వచ్చేవేళ దాటిపోయి చాలాసేపయిందప్పటికే. వాళ్ళ కోసమే ఎదురుచూస్తున్నాన్నేను. దిగబడ్డారన్నమాట.

కానీ, విచిత్రం... ఎప్పుడూ తుఫానుల్లాగా దూసుకొస్తుంటారింట్లోకిద్దరూ. అలాంటిది వచ్చిన అలికిడే వినిపించకుండా రావటం,



గుసగుసలాడుతున్నట్టు పిలవటం... ఏం వెధవ పని చేసొచ్చుంటారు చెప్మా!

"ఎప్పుడొచ్చారర్రా?" అన్నా అనుమానంగా.

"ఉష్షు... ఉష్షు" కోరస్‌గా అన్నారిద్దరూ- నోటిమీద వేళ్ళుంచి నిశ్శబ్దం సింబల్ చూపిస్తూ.

తెల్లబోతూనే "ఎందుకూ?" అన్న ప్రశ్నను భంగిమగా మార్చి మౌనంగా అడుగుతున్నానింకా-

ఇంతల్లోకి ఏదో జరిగింది... తెల్లటి బంతిలాంటి ఆకారమొకటి మీదికి ఉరికినట్టనిపించి కంగారుగా పక్కకి గెంతాను.

నా భయం చూసి పిల్లలిద్దరూ నోటికి చేతులడ్డంపెట్టి కిసుక్కున నవ్వారు. నిదానించి చూశాను. బంతి కాదది... బుల్లి కుక్కపిల్ల. చిన్నగా చిందులు వేస్తున్నట్టుగా వంటిల్లంతా పరిగెడుతోంది.

ముచ్చటగా చూశాను "ఇదెక్కడ దొరికిందిరా?" అంటూ.

మా బాబ్జీ స్కూలు ఫ్రెండు సతీష్ వాళ్ళ పెంపుడు కుక్కకి నాలుగు రోజులక్రితం నాలుగు కుక్కపిల్లలు పుట్టాయట. 'ఎంచక్కా ఉన్నాయ్ కుక్కపిల్లలు' అని వాడు తెగ ఊరిస్తుంటే స్కూలు వదిలాక తోవే కదా అని వాళ్ళింటికి వెళ్ళారట.

నాలుగు తెల్లటి కుక్కపిల్లలు. అక్కడక్కడా నల్లటి మచ్చలతో ఎంతో ముద్దొస్తున్నాయట. గంటసేపు ఆడుకున్నాక వదల్లేక వదల్లేక వచ్చేస్తూంటే సతీష్ వాళ్ళమ్మగారు 'పోనీ, ఒకదాన్ని తీసుకెళ్ళండిరా' అన్నారట. అన్నదే ఆలస్యం ఆనందంగా పట్టుకొచ్చేశారు.

మంచి జాతి బొచ్చు కుక్కపిల్ల. కొనాలంటే మూడు నాలుగు వేలకు తక్కువుండదు. కానీ, అది నీళ్ళబిందె దాకా వెళ్ళి మూతి పైకెత్తబోతుంటే అప్పుడు ఒళ్ళు తెలిసింది నాకు.

"అమ్మో- అమ్మో, బామ్మ చూస్తే చంపేస్తారు. ముందు దీన్ని వంటింట్లోంచి బయటికి తీసుకుపోండి" హడలిపోతూ అరిచాను.

గబుక్కున పైకెత్తుకున్నాడు బాబ్జీ దాన్ని. ఇక వంటింట్లోంచి పెరట్లోకున్న మెట్ల మీద నిలబడి ఒకటే బతిమలాడటం మొదలుపెట్టారిద్దరూ. "అమ్మా.. అమ్మా... ప్లీజ్ ప్లీజ్" అంటూ.

"వద్దొద్దు... అసలే బామ్మకి నిష్ఠా నియమాలూ ఎక్కువ. కుక్కపిల్ల ఇంట్లో తిరగటానికి అసలు ఒప్పుకోరు. వెళ్ళి వాళ్ళింట్లోనే ఇచ్చేసి రండి" అన్నాన్నేను ఖండితంగా.

"బామ్మ దగ్గరికి వెళ్ళకుండా చూసుకుంటాంగా. ఇంట్లోక్కూడా రానివ్వం. సరే అనవా ప్లీజ్."

"ఊహు వీల్లేదు. దున్నపోతుల్లా ఎదిగారు ఇద్దరూ. ఒక్క పని సొంతంగా చేసుకోరు. మీకు సేవ చేసేటప్పటికే నా నడుం విరిగిపోతోంది. అది చాలక ఇదొకటి- నావల్ల కాదు బాబూ" విముఖత చూపించాన్నేను.

"అబ్బొబ్బో. దాని పని నువ్వస్సలు చేయొద్దు. అన్నీ మేమే చూసుకుంటాం. నిజంగా అంటే నిజంగా. అమ్మా... అమ్మా..."

మేమిట్లా వాదులాడుకుంటూనే ఉన్నాం. ఈ గొడవకి ముందు గదిలో టీవీ చూస్తూ వత్తుల కోసం పత్తిలో విత్తులు తీసుకుంటున్న అత్తమ్మ లేచి రానే వచ్చారు- "ఎవరితో వసూ మాట్లాడుతున్నావ్?" అంటూ.

రావటమేమిటి - ఎదురుగా గుమ్మం వెనుక మెట్టుమీద మా బాబ్జీ చేతిలో కుక్కపిల్లని చూడ్డమేమిటి - మండిపడ్డారత్తమ్మ. "ఒరే ఒరే, ఏమిట్రా అదీ... కుక్కపిల్లని ఎత్తుకు మరీ పట్టుకొచ్చావా? ఛీఛీ, వెధవకానా అనీ - ఫో, వెళ్ళి దాన్ని వీధిలో వదిలేసిరా. ఇద్దరూ వెళ్ళి స్నానంచేసి తగలడండి. ఆ బట్టలు బక్కెట్‌లో ముంచి మరీ రండి" అంటూ ఒకటే రంకెలు.

బిక్కమొహం వేసి రెండు మెట్లు అపూ దిగింది కానీ, మా గడుగ్గాయి బాబ్జీ మటుకు "ఊహు వదలం. దీన్ని పెంచుకోటానికి తెచ్చాం" అని బింకంగానే కుండ బద్దలు కొట్టాడు.

ఇంకేముంది... ఏన్నోదో గానీ ప్రపంచయుద్ధం మొదలైంది. అత్తమ్మ యథావిధిగా తాండవం చేశారు. పిల్లలు పెంకిగా కాదని మొరాయించారు. రెండువక్షాల వారినీ సమాధానపరచలేక నేను చేతులెత్తేశాను.

సమరమిలా సాగుతుండగానే ఆఫీసు నుంచి మావారు దిగబడ్డారు. కేసు సుప్రీంకోర్టుకి బదలాయించారు. ఇరుపక్షాలూ ఎవరి వాదనలు వాళ్ళు గట్టిగా వినిపించారాయనకి.

"మొన్న సెలవుల్లో మా స్కూలువాళ్ళతో టూరుకి పంపించమంటే డబ్బుల్లేవన్నారు. మా ఇద్దరికీ సైకిళ్ళు కొనిపెడతామని చెప్పి మరిచిపోయినట్టు నటించారు. ఇప్పుడు ఏ ఖర్చూ లేకుండా ఈ బుజ్జి కుక్కపిల్లని పెంచుకుంటామంటే కూడా కుదరదంటారా. ఇది చాలా అన్యాయం"- ఇది పిల్లల నిష్ఠూరం.

'ఈ కుక్కపిల్లని ఎంతో ఇష్టంగా తెచ్చుకున్నాం. ఏమైనా సరే, దీన్ని ఇచ్చేయం, పెంచుకుంటాం' - ఇది వాళ్ళ గాఢ వాంఛ.

'మీరు సరే అనేదాకా అన్నం తినం. మాట్లాడం. నానమ్మ తావళం దాచేస్తాం. నాన్న బైకు తాళాలు పారేస్తాం'- ఈ బెదిరింపూ వాళ్ళదే.

అత్తమ్మా ఏం తక్కువ తినలేదు. ఏకమొండి ధోరణి ఆవిడది. "వీల్లేదురా. అస్సలు వీల్లేదు. శునకాలూ సూకరాలూ తిరుగుతోంటే ఇక ఇంటికీ వీధికీ తేడా ఏముంది? ఆ దిక్కుమాలిన కుక్కముండ గదులన్నీ తిరిగి మైల పడేస్తూంటే, దేవుడి ముందర దీపారాధన ఎలా చేసుకోను? ఈ పిల్లకుంకలు దాన్ని ముట్టుకునీ, హత్తుకునీ ఆ బట్టల్తో, ఆ చేతుల్తో ప్రసాదం కోసం చేయి జాపటం తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తోంది. వద్దు నాయనా వద్దు. ముండా తంటసాన్ని వదిలించుకు రమ్మను" తల అడ్డంగా ఊపేస్తూ శాసిస్తున్నారు గట్టిగా.

'పట్టమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకి కోపం' అనే సమస్య గద్దదే. ఎవరిపక్షానా తీర్పివ్వలేని పరిస్థితే. కానీ మావారున్నారే... ఆయనకి ఇలాంటి చిట్టీ పొట్టీ తగువులు తీర్చటంలో నేర్పరితనం చాలా ఎక్కువ.

అసలు భూత దయ అనేది అందరూ మెచ్చుకోదగిన గొప్ప గుణమనీ, పిల్లల్లో చిన్నతనం నుంచే దాన్ని పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉన్నదనీ, అది ఇలాంటి పెట్స్ పెంపకంవల్ల సులభ సాధ్యమవుతుందనీ చాలా సమర్థంగా చిన్న ఉపన్యాసం ద్వారా ఊదరగొట్టి 'ఊహు' అని అనలేని పరిస్థితిలోకి మా అత్తగార్ని ఇరికించేసి అయిష్టంగానే అవుగాక 'నీ ఇష్టం నాయనా' అని ఆవిడచేత అనిపించేశారు.

ఇక పిల్లల కోరిక మన్నించినట్టుగా ప్రకటిస్తూనే తన తల్లి తృప్తిపడేలా వాళ్ళచేత సవాలక్ష వాగ్దానాలు చేయించారు.

మా చిరంజీవులు ఉన్నారు చూశారూ- కార్యసాధన కోసం ఎటువంటి నిబంధనలనైనా ఒప్పేసుకోటానికీ, ఎలాటి హామీలనైనా ఇచ్చేయటానికీ వెనకాడని ప్రజానాయకులకి ఏమాత్రం తీసిపోరనుకోండి.

"అలాగే నాన్నగారూ, మీరు చెప్పినట్టే నడుచుకుంటాం. బామ్మని అసలు ఇబ్బంది పెట్టం. దాన్నసలు ఇంట్లోకే రానివ్వం. మేడ మెట్లకింద కట్టేసే ఉంచుతాం. మేమింట్లో ఉన్నప్పుడు మటుకే గొలుసు విప్పి ఆడించుకుంటాం. దాన్ని ముట్టుకున్నాక స్నానం చేసి మరీ ఇంట్లోకొస్తాం" అన్నారు మహా బుద్ధిమంతుల్లాగా.

మా అత్తమ్మ సమాధానపడ్డట్టుగానే అగుపించారప్పటికి. అలాగ ఆ కుక్కపిల్ల 'స్నోవీ' మా ఇంట్లో మెంబరయింది.

అప్పట్నుంచే మొదలయ్యాయి తిప్పలు.

★ ★ ★

అన్నట్టుగానే నాలుగురోజులపాటు ఏమాత్రం ఏమరుపాటు లేకుండా చూసుకున్నారు పిల్లలు స్నోవీని. అది కూడా కొత్త మూలానో ఏమో కుదురుగానే ఉంది. అక్కణ్ణుంచీ హుషారందుకుంది. బాగా ఆటలు నేర్చుకుంది. ప్రహరీ లోపలంతా ఉన్నచోటుండకుండా ఒకటే పరుగులు పెట్టడం, నిచ్చెన మెట్లెక్కినట్టు పిల్లల మీద ఎగబాకటం, కాళ్ళ చుట్టూరా తిరిగి ఎత్తుకొమ్మన్నట్టు 'కుయ్ కుయ్'లాడుతూ గారాబాలు పోవటం, 'స్నోవీ' అని పిలవగానే ఎక్కడున్నా పరిగెత్తుకు రావటం.

పిల్లల ఉత్సాహం, సంతోషం చెప్పతరం కావట్లేదు. నాకూ ముద్దుముద్దుగానే అనిపిస్తోంది కానీ అది ఒక్కోసారి ఉన్నట్టుండి దాని పరుగులో భాగంగా గుమ్మం ముందు చీడీలు ఎక్కేసి ఇంట్లోకొచ్చేస్తోంది. ఇంకోసారి సందులో నుంచి పెరట్లోకి పరిగెత్తుకుంటూ వచ్చేసి



తులసికోటని ముట్టుకున్నంత పన్జేసింది. నేనూ, పిల్లలూ కలిసి ఎలాగో ఆ ప్రమాదాన్ని ఆపగలిగాం కానీ, ఆ లోపునే అత్తమ్మ ఎత్తుకున్న అష్టోత్తరాన్ని మాత్రం అడ్డుకోలేకపోయాం.

'నేను ముందే చెప్పానా- జాగ్రత్తగా ఉండమనీ' అన్నట్టు ఓ చూపు చూస్తారు మా ఆయన- తప్పు దొరకబుచ్చుకున్నట్టు నిష్ఠూరంగా.

ఈ గోలంతా ఎందుకు, మెడకి బెల్టు వేసి గొలుసుక్కట్టేస్తానంటే- ఊహు ఒప్పుకోరు మళ్ళీ. 'పాపం రోజుల గుడ్డు. మెడకి బెల్టు వేస్తే చర్మం నలిగిపోతుంది. ఎటూ రాత్రిళ్ళు కట్టేస్తూనే ఉన్నాం కదా' అంటూ ఎక్కళ్ళేని జాలీ ఒలకబోస్తారు.

ఈ స్నోవీ మూలంగా దినదినగండం కాదు, క్షణక్షణ గండమయిపోయింది నాకు. పిల్లలు స్కూలుకెళ్ళారంటే మా పనమ్మాయి రేణుకకీ, నాకూ స్నోవీ అటూ ఇటూ పోకుండా కాపలా కాయటం తప్ప, మరే వ్యాపకమూ లేకుండాపోయింది.

చెప్పొద్దూ... స్నోవీ వచ్చాక దాన్తో తప్ప మరే కాలక్షేపమూ పెట్టుకోబుద్ధి కావటంలేదదేమిటో. మా పిల్లలు నేనెత్తుకునే స్టేజ్ దాటిపోయారేమో స్నోవీ నన్ను చూడగానే ఆ పొట్టితోక తెగ ఊపేస్తూ ఆత్మీయత వెల్లారుస్తూ దగ్గరకు రాబోతే ప్రేమగా చేతులు చాపాలని ప్రాణం కొట్టుకుంటుంది. అది గునగున నడుస్తూ వస్తోంటే దోగాడుతూ వచ్చే పసిపాప గుర్తొచ్చి ఒళ్ళోకి తీసుకోవాలనిపిస్తుంది. కానీ, అమ్మో... దాన్ని ముట్టుకోవటమా- అత్త చూస్తే- నో... మళ్ళీ స్నానం, జపం. రెండు మూడుసార్లు ఆవిడ లేనప్పుడూ, చూడనప్పుడూ అలాగే కక్కుర్తిపడ్డాను కూడా. నాలుగోసారి పట్టుబడిపోయాను. కొరకొరా చూశారత్తమ్మ. కిక్కురుమనకుండా స్నానానికి వెళ్ళిపోయాను.

రెండ్రోజులపాటు చాలా కోపంగా ఉన్నారత్తమ్మ నామీద. 'చిన్నాళ్ళకే అనుకుంటే పెద్దాళ్ళకీ పట్టుకుంది పిచ్చి' అనో, 'కుడిచేతికీ ఎడంచేతికీ తేడా లేకుండాపోతోంది కొంపలో' అంటూనో రోజంతా గొణుక్కుంటూనే ఉన్నారు.

బుద్ధొచ్చింది నాకు. అత్తమ్మ కోపం అస్సలు తట్టుకోలేన్నేను. చాలా జాగ్రత్తగా ఉంటున్నానప్పట్నుంచీ. ఆ భడవా స్నోవీ, గెంతులేసి ఆడుకుంటున్నా, నేను పూలు కోసుకోటానికో బట్టలారేయటానికో ఇంట్లోంచి బయటకొచ్చినప్పుడల్లా నా వెంటవెంటే తిరుగుతున్నా- పిల్లలు దాంతో ఆడుకుంటూ అదిచేసే చిన్నచిన్న చేష్టలకి ఉత్సాహపడుతూ, 'అమ్మా చూడు చూడు, ఆ బంతినెలా కాళ్ళతో నెడుతోందో చూశావ్' అని అరుస్తోన్నా, రేణుక స్నోవీకి స్నానం చేయిస్తూ సాయమడిగినా, చూసీచూడనట్టూ, నన్ను కాదన్నట్టూ పట్టించుకోకుండా ముభావంగా ఉండిపోతున్నాను.

అందుకేనేమో కాస్త శాంతించినట్టున్నారత్తమ్మ. మొదట్లోలాగా పిల్లలు స్నోవీని ముట్టుకున్నప్పుడల్లా స్నానం చేయమని హంగామా చేయట్లేదు. కాళ్ళూ చేతులూ కడుక్కురమ్మని ఇన్ని పసుపునీళ్ళు నెత్తిన చల్లి ఊరుకుంటున్నారు. 'ఆ కుక్కముండకి పొయ్యాలిగా, ఇంకో పాల ప్యాకెట్టు తీసుకో' అంటూ ఉదారం చూపిస్తున్నారు.

'పరవాలేదు, నెమ్మదిగా మారుతున్నారత్తమ్మ' అనుకుని చాలా సంతోషించాను.

కానీ, నా అంచనా తప్పు.

★ ★ ★

కెవ్వుమన్న కేక. అత్తమ్మ గొంతది. ఇంకా పూర్తిగా తెల్లారలేదు. నిద్రమంచం మీంచి చివాలున లేచాను. మావారప్పటికే మంచం

దిగి పరిగెడుతున్నారు కంగారుగా.

పెరటిగుమ్మం బయట కిందమెట్టు మీదున్నారత్తమ్మ- పడిపోబోతూంటే పట్టుకోసం పట్టుకున్నట్టు రెయిలింగ్‌ని గట్టిగా ఒడిసి పట్టుకుని.

"ఏమయిందమ్మా? ఏమిటత్తమ్మా?" అన్నాం - ఏమీ కాలేదుగదా అని ఆవిణ్ణి నిలువెల్లా హడావుడిగా చూపుల్తో తడిమేస్తూ.

"ఏమయిందా- నా శ్రాద్ధమయింది. మొహం కాదు కింద చూడండి" ఉగ్రంగా అరిచారత్తమ్మ. సన్నగా వణుకుతున్నారావిడ.

చూపు దింపాం. ఏమున్నదక్కడ? చీర కుచ్చిళ్ళు కొద్దిగా ఎత్తి పట్టుకున్న అత్తమ్మ కాళ్ళకింద... హారి భగవంతుడా, ఈ భడవా స్నోవీ ఎంత వెధవ పన్జేసిందీ!

అప్పుడు తెలిసింది. అత్తయ్య వణికేది- భయానిక్కాదు వెలపరానికని.

అసలీ స్నోవీ ఇటువైపెలా వచ్చిందీ?

దాన్ని రాత్రిళ్ళు ముందువైపు ఓపెన్ వరండాలో కిటికీకి కట్టేస్తున్నాం- మెత్తని గుడ్డతో. రాత్రి కూడా రోజూ మాదిరిగానే కట్టేశామే మరి?

ఇది మా బాబీగాడి నిర్వాకమై ఉంటుంది. అంత అందంగా లూజులూజుగా ముడి వేసుంటాడు. అది అటూ ఇటూ గింజుకునేసరికి ఊడి వచ్చేసుంటుంది బహుశ.

"అయ్యో రామా, ఇప్పుడీ స్నోవీ ఎటుపోయిందో ఏమో!?"

"స్నోవీ" అని పిలుస్తూ పిల్లలు ముందువైపు పరుగు తీశారు. మేము అత్తమ్మ వేస్తున్న అక్షింతల బరువుతో తలలు వంగిపోతుండగా ఆవిడ కాళ్ళ ప్రక్షాళనలో పడ్డాం.

ఇంతల్లో "అమ్మోయ్, నాన్నోయ్" అని పిల్లల గావుకేకలు.

'మళ్ళా ఏం కొంప మునిగింది- ఒకళ్ళ తరవాత ఒకళ్ళు ఈ హాహాకారాలేమిటి?'

గబగబా వెళ్ళాను. చూద్దును గదా- నిజంగానే ఇంకో పుట్టిముంచే అఘాయిత్యం చేసిందీ స్నోవీ.

సందు వైపున దండేనికి రాత్రిళ్ళు మడి పట్టుచీర ఆరేసుకుంటారత్తమ్మ. చీరేమో పెద్దది. మామూలుగానే ఆరేసినప్పుడు నేలకానేలా వేలాడుతూ ఉంటుంది. దాన్ని ఎలా పట్టుకు కిందికి లాగిందో ఏమో కుప్పగా కిందికి జారిందా చీర. ఆ చీర కింద చిక్కడిపోయింది స్నోవీ. ఇవతలికి రాలేక గింజుకుంటూ ఒకటే పొర్లిగింతలు పెడుతోంది. నోటితోనూ కాళ్ళతోనూ ఆ చీరని చుట్టబెట్టేసుకుంటూ గుర్రుగుర్రు శబ్దాలు చేస్తూ నానా హంగామా చేస్తోందది.

ఎప్పుడనగా ఆ చీర పనిపట్టడం మొదలెట్టిందో ఏమో చీర ఆకారం తెలియట్లేదు. చీలికలూ పాలికలూ అయిపోయింది.

నా కరచరణాలాడట్లేదు.

అసలే అశుద్ధం తొక్కి పరిశుద్ధం కావటానికి గంగలో మునిగిరావాలా, ప్రాయశ్చిత్తం చేయించుకోవాలా అన్న లెవల్లో పరిహారాలు తనకు తానే విధించుకుని చిటపటలాడిపోతున్నారత్తమ్మ అప్పటికే. పులి మీద పుట్రలా ఇప్పుడీ మడిచీర వ్యవహారం కూడా తెలిస్తే ఇంకెంత భైరవులౌతారో ఏమిటో!?

దేవుడా నువ్వే రక్షించాలి.

★ ★ ★

ముసిరిన మబ్బు చూసి కుంభవృష్టి పడుతుందనుకుంటే చుక్క చినుకు రాలలేదు. ఇది మరీ ప్రమాదం.

రెండురోజులయింది అత్తమ్మ 'ఊ' 'ఆ' అనటం తప్ప మాతో సరిగా



మాట్లాడటమే లేదు.

తల్లంటే ప్రాణం మావారికి. ఆవిడ నొసలు ముడిపడితే విలవిల్లాడిపోతారాయన.

ఎప్పుడూ గలగల్లాడుతూ ఏదో ఒకటి చెబుతూనే ఉండే అత్తమ్మ అలా మూగనోము పట్టడం నాకూ ఏం బావుండలేదు. పిల్లలు స్నోవీని వాళ్ళ బామ్మ కంటపడకుండా చూసుకుంటున్నారు. అది ఎంత గింజుకుంటున్నా మెట్లకింద గూడులా ఉండేచోట కట్టేసే ఉంచుతున్నాం ఎప్పుడూ.

"ఊహూ ఇల్లిలా నిద్రపోతున్నట్టు నిశ్శబ్దంగా ఉండటం నాకేం బాలేదు వసూ" అన్నారాయన ఆఫీసుకు వెళుతూ ఆరోజు.

'అవును' అన్నట్టు బాధగా తల ఊపాన్నేను.

ఆ సాయంత్రం ఆఫీసునుంచొస్తూ తనతో వెంటపెట్టుకొచ్చిన వారిద్దర్నీ పరిచయం చేశారు- "విశ్వనాథరావు అనీ - నా కొలీగ్, అతని మిసెస్" అని.

ఫార్మాలిటీగా టీ, బిస్కెట్లూ, కొంచెంసేపు ఆ మాటా ఈ మాటా అయినాయి. వాళ్ళు వెళతామిక అన్నప్పుడు చెప్పారు- "స్నోవీని పెంచుకుంటామన్నది వీరే" అని.

తలూపాన్నేను మ్లానంగా.

ఆమె స్నోవీని ఎత్తుకుంది. కాసేపు ఇష్టంలేనట్టు జారిపోబోయిందిగానీ తరవాత ఏం చేస్తాం అన్నట్టు ఊరుకుంది.

వాళ్ళలా గేటు దాటారు. అప్పటివరకూ మొహమాటానికి ఆపుకున్న దుఃఖం బయటపడింది. ఒకటే ఏడుపు పిల్లలిద్దరూ.

వాళ్ళని దగ్గరకు తీసుకుని కళ్ళు తుడుస్తూ ఓదారుస్తున్నారాయన. స్నోవీని పెంచడంలో రానురాను ఎన్ని ఇబ్బందులెదురవుతాయో ఏకరువు పెడుతున్నారు. దానికి బదులు అక్వేరియం కొని తెస్తాననీ, దాన్లో మంచిమంచి చేపల రకాలూ, గోల్డ్‌ఫిష్‌లూ వేద్దామనీ, చక్కటి అక్వేరియంలో పెట్టుకునే బొమ్మలు తెచ్చి అందులో పెడదామనీ... నోటితో ఊహాచిత్రాలు వేసి ఊరించుదామని చూస్తున్నారు.

'పోనీ... లవ్ బర్డ్స్, పంజరం తెచ్చుకుందామా?' అని ఆశలు పెడుతున్నారు.

"మీకేమన్నా బుద్ధుందా?" గుమ్మంలో అత్తమ్మ. అప్పుడే గుడి నుంచి వస్తున్నారు. ఒక చేతిలో పూలసజ్జతోపాటు పొదవి పట్టుకున్నట్టుగా ఇంకో చేతిలో స్నోవీ.

"కొంటెపనులు చేసినందుకు ఒళ్ళు మండి ఆ కోపంలో మొహం కాస్త ముడుచుకున్నానే అనుకో- అందుకని, కంటిముందు ముచ్చటగా తిరుగుతున్న పసికూనని పరాయివాళ్ళ వెంట పంపించేస్తారా? కోపంలో ఎన్నో అనుకుంటాం. అందాకా ఎందుకూ... పిల్లల్ని ఎన్నంటాం... చావవే అంటాం - చంపేస్తా, నరికేస్తా అంటాం... అవతలికి పొమ్మంటాం. అలాగని చంపేస్తామా, ఇంట్లోంచి తరిమేస్తామా? కోపం తగ్గగానే దగ్గరకు తీయమా. వాళ్ళలాంటిది కాదూ ఇదీ... పిచ్చిబొంద. రోడ్డుమీద నన్ను చూడగానే తీర్థంలో తప్పిపోయిన పిల్లకి అమ్మ కనిపించినట్టు మొహం విప్పారిపోయింది. నా మీదకి ఎలా దూకిందనుకున్నారూ- గుండె నీరయిపోయిందనుకో" ఆర్ద్రతని అనుభవిస్తూ చెబుతున్నారత్తమ్మ.

విభ్రాంతిగా చూస్తున్నాం నేనూ, ఆయనా. ఆవిడ చేతుల్లోంచి జారిన స్నోవీని ఎత్తుకుంటున్న పిల్లల కళ్ళనీళ్ళలో అత్తమ్మ పట్ల కృతజ్ఞత తళుక్కుమంటోంది.

ఇంతకీ దీనికి ఉపసంహారం ఏమిటంటే-

"సరే, పాపం మూగజీవి... ఎంత బెదిరిపోయిందో ఏమో... నోరు విప్పి చెప్పగలదా ఏమన్నానా? దాన్ని కాసేపు బుజ్జగించండి. కాసిని పాలో పాడో పట్టండి. నేను వెళ్ళి తలస్నానం చేసొస్తా. దాన్ని ముట్టుకు వచ్చాగా..." అంటున్నారత్తమ్మ బాత్‌రూమ్ వైపు వెళుతూ.

హతోస్మి!

★